రొయ్య రైతులను ఆదుకోవాలని ధర్నా

గణపవరం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల మోత వల్ల ఆక్వా పరిశ్రమ దివాళా తీసే ప్రమాదంలో ఉందని, తమను ఆదుకోవాలంటూ రొయ్య రైతులు ఆదివారం స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఆక్వా రైతు కాకర్ల వినాయక అధ్యక్షత వహించారు. ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నాయకులు రుద్రరాజు యువరాజు, స్థానిక నేత అడబాల రంగా మాట్లాడుతూ ఆక్వా రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రొయ్యకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి కూనసాని నాగేశ్వరరావు, గుల్లిపల్లి మాధవ, రమేష్‌బాబు, భూపతిరాజు సతీష్, విష్ణు, ప్రియమధు నాయకత్వం వహించారు.

ధర్నా చేస్తున్న ఆక్వా రైతులు

విద్యుత్ బిల్లు తీయండి.. మహాప్రభో..!

3న తీయాల్సిన బిల్లులు నేటికీ తీయని దుస్థితి

యూనిట్ శ్లాబులు పెరిగి బిల్లుల బాదుడుపై జనం బెంబేలు

తమకేమీ సంబంధం లేదంటున్న విద్యుత్ శాఖాధికారులు

ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల పేరుతో బాదుడు

ఆలస్యంగా తీయడంతో షాక్ కొట్టనున్న బిల్లులు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో జనాలకు విద్యుత్ బిల్లులు పెనుభారంగా మారుతున్నాయి. విద్యుత్ వాడకం నిర్ధారించే బిల్లులు సమయానికి తీయడంలో విద్యుత్ శాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో యూనిట్ శ్లాబ్‌లు పెరిగిపోయి విద్యుత్ బిల్లులు భారంగా మారే పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యుత్ బిల్లులు తీయండి.. మహాప్రభో అంటూ జనం ఆందోళన చెందుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 12 లక్షల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతులు గృహ వినియోగదారులు ఉన్నారు. ప్రతినెలా మూడో తేదీన ప్రారంభించి ఒక్కో ప్రాంతానికి ఒక్కో తేదీన విద్యుత్ బిల్లులను జనరేట్ చేస్తారు. ఏమాత్రం ఆలస్యమైనా యూనిట్ శ్లాబులు మారిపోతాయి. విద్యుత్ బిల్లులో ఒకటి నుంచి 50 యూనిట్ల వరకూ ఒక ధర, 50 నుంచి వంద యూనిట్ల వరకూ ఇంకో ధర ఇలా అంచెలంచెలుగా యూనిట్ ధరలు ఉంటాయి. ప్రతినెలా 50 యూనిట్లులోపు ఖర్చు చేసే వినియోగదారుడికి నాలుగైదు రోజులు ఆలస్యమైతే విద్యుత్ యూనిట్లు పెరిగి బిల్లు మోత మోగనుంది. విద్యుత్ బిల్లులు సకాలంలో తీసేలా ప్రభుత్వం ప్రయివేటు వారికి అప్పగించింది. ఏలూరులోని పవర్‌పేటలో ఏప్రిల్‌లో కరెంటు బిల్లులు మూడో తేదీన తీయాల్సి ఉంది. ఆరో తేదీ వచ్చినా ఇప్పటికీ కరెంటు బిల్లులు తీయలేదు. ఇప్పటికే మూడు రోజులు అదనంగా గడిచిపోయింది. ఇంకా ఎన్ని రోజులకు తీస్తారో కూడా తెలియని పరిస్థితి ఉంది. పవర్‌పేటలోనే కాదు, జిల్లా కేంద్రం ఏలూరులోని పలు ప్రాంతాలతోపాటు, గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. విద్యుత్ బిల్లుల రూపంలో పెద్దఎత్తున ఆదాయం దండుకుంటున్న విద్యుత్‌శాఖ ప్రజలకు విద్యుత్ బిల్లులు సకాలంలో అందించడంలో మాత్రం విఫలమవుతోంది. కరెంటు బిల్లులు సకాలంలో తీయకపోవడంతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



ఇప్పటికే అదనపు ఛార్జీల బాదుడుతో గగ్గోలు

గత వైసిపి ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం సైతం అదనపు ఛార్జీల బాదుడుతో వినియోగదారులను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఎనర్జీ, ఫిక్స్‌డ్, ట్రూఅప్, ఇడి ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ 1, 2, 3 ఛార్జీల రూపంలో వీర బాదుడు బాదుతోంది. నెలకు రూ.600 కరెంటు బిల్లు వస్తే అందులో రూ.300 అదనపు ఛార్జీలే ఉంటున్నాయి. ఇప్పుడు విద్యుత్ బిల్లు తీయడం ఆలస్యం చేయడంతో శ్లాబులు మారిపోయి బిల్లులు మరింత మోతమోగిపోయే పరిస్థితి ఏర్పడింది. కరెంటు బిల్లులు సైతం సకాలంలో అందించకపోవడంపై కూటమి ప్రభుత్వంపై జనాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ బిల్లుల ఆలస్యంపై ఆ శాఖ అధికారులను అడిగినా సరైన సమాధానం లేకుండాపోయింది. పవర్‌పేటలో విద్యుత్ బిల్లుల ఆలస్యంపై ఆ శాఖ పరిధిలోని అధికారితో మాట్లాడగా ప్రయివేటుకు ఇచ్చారని, తామేమీ చేయలేమని చేతులెత్తేసిన పరిస్థితి ఉంది. బిల్లు కావాలంటే వాట్సాప్‌కు సర్వీస్ నెంబర్ పంపితే వచ్చి బిల్లు తీస్తారంటూ విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. విద్యుత్ బిల్లులు సకాలంలో తీయకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత కాంట్రాక్టర్‌ను నిలదీయాల్సిన అధికారులు తప్పించుకునే ధోరణిలో మాట్లాడటం విడ్డూరంగా ఉంది. విద్యుత్ బిల్లుల ఆలస్యంపై ఏలూరులోని విద్యుత్‌శాఖ ఎస్ఇని వివరణ కోరేందుకు ఫోన్లో ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. వెంటనే విద్యుత్ బిల్లులు తీసేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను జనం కోరుతున్నారు.

పిజిఆర్ఎస్ వికేంద్రీకరణ

నేడు నూజివీడులో కలెక్టర్‌చే వినతుల స్వీకరణ

ప్రజాశక్తి – ఏలూరు

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్, జిల్లాస్థాయిలోనూ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొని వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను యథావిధిగా ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో స్వీకరిస్తారని తెలిపారు. జిల్లా, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో యథావిధిగా ఫిర్యాదులు స్వీకరిస్తారని, దీన్ని ప్రజలు గమనించి అర్జీలు అందించాలని సూచించారు.

ఆశ్రం హాస్పిటల్స్ ఆధ్వర్యాన 5కె వాక్

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు ఆశ్రం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 5కె వాక్‌ను ఆ హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ హనుమంతరావు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని ప్రపంచం అలవాటు చేసుకుంటుందని, ప్రతిఒక్కరూ తమ యాంత్రిక జీవన విధానం వల్ల ఎంతో ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ ఉదయాన్నే వాకింగ్ చేయాలని సూచించారు. వాకింగ్ ద్వారా వ్యాధులు రాకుండా, శరీరం ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. యూరాలజిస్ట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ మన జీవన విధానం, ఆహారపు అలవాట్లు కారణంగా చక్కని ఆరోగ్యాన్ని దూరం చేసుకుంటున్నామన్నారు. ఆశ్రం మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ఒక కొత్త నినాదంతో ప్రజలకు ఆరోగ్య అలవాట్లపై అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ సంవత్సరం గర్భిణులకు, నవజాతి శిశువులకు ఆరోగ్యం, వారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు గురించి అందరికీ అవగాహన కల్పించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రం మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, పారా మెడికల్ కాలేజీ విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



5కె వాక్‌ను ప్రారంభిస్తున్న హాస్పిటల్స్ సిఇఒ హనుమంతరావు

'పోలవరం'లో వడగండ్ల వాన

కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి – పోలవరం

మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో వడగండ్ల వాన కురిసింది. గాలులకు వెంకటరెడ్డిగూడెంలో అంగన్వాడీ భవనం పైకప్పు లేచి పడింది. కొత్త పట్టిసీమలో రోడ్డుపై భారీ వృక్షం పడింది. దీంతో ఏజెన్సీ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పట్టిసీమ నుంచి జీలుగుమిల్లి వెళ్లే ఎన్‌హెచ్ 365 రోడ్డు మార్గంలో వెంకటాపురం నుంచి ఎల్ఎన్‌డి పేట మధ్య భారీ చెట్లు కూలిపోయాయి. స్థానికుల సాయంతో తహశీల్దర్ సాయిరాజు చెట్లను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

సిపిఎం నుంచి కిషోర్, జగన్నాధం బహిష్కరణ

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

అవినీతి, పార్టీ విచ్ఛినకర కార్యకలాపాలకు పాల్పడినందున పల్లెం కిషోర్, బి.జగన్నాధరావులను సిపిఎం ప్రాథమిక సభ్యత్వం నుండి బహిష్కరించినట్లుగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ పద్ధతులకు, ప్రమాణాలకు భిన్నంగా వ్యవహరించడమే కాకుండా అవినీతికి పాల్పడినట్లుగా రుజువు కావడంతో జిల్లా కమిటీ నాలుగు నెలల క్రితమే చర్య తీసుకుందని, వారు తమ పొంపాట్లు సరిదిద్దుకోకపోగా ఇటీవల పార్టీ విచ్ఛిన్నకర కార్యక్రమాలకు పాల్పడుతున్నందున కిషోర్, జగన్నాధరావులను సిపిఎం నుంచి బహిష్కరించాలని రవి తెలిపారు.

29న ఇండియన్ రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

డిఆర్ఒ కె.విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి – ఏలూరు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు ఏలూరు ప్రభుత్వ ఆసు పత్రిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు డిఆర్ఒ కె.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు నూతన మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారని, ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ శాఖలో సభ్యత్వం కలిగిన పెట్రాన్, వైస్ పెట్రాన్ లైఫ్ మెంబర్స్, లైఫ్ అసోసియేట్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

24 గంటలైనా లేని విద్యుత్ సరఫరా

అందని తాగునీరు

చింతలపూడిలో ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి – చింతలపూడి

చింతలపూడిలో శనివారం సాయంత్రం వచ్చిన అకాల గాలి, వాన కారణంగా ఆదివారం సాయంత్రం వరకు నగర పంచాయతీలో విద్యుత్ సరఫరా లేని పరిస్థితి నెలకొంది. చింతలపూడి పట్టణం, వెలమపేట, బోయగూడెం, మారుతినగర్, ఆంథోనినగర్, కొవ్వూరుగూడెంలో గాలి, వాన కారణంగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరా 24 గంటలవుతున్నా ఇంకా రాలేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాపై స్థానిక లైన్‌మ్యాన్, అధికారులు కనీసం సమాధానం కూడా చెప్పడం లేదని జనం వాపోతున్నారు. ఆదివారం శ్రీరామనవమి పండుగ కావడంతో కుటుంబాలతో సరదాగా గడుపుదామనుకున్నా ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉక్కపోతతో పిల్లల వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లైన్‌మ్యాన్‌కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా సరైన సమాధానం చెప్పడం లేదని, విద్యుత్ సరఫరా ఎందుకు రావడం లేదో, ఎన్ని గంటలకు వస్తుందో కనీసం సమాచారం ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. దీనిపై చింతలపూడి ఎడి రాంబాబు నాయక్‌ను వివరణ కోరగా ఆదివారం రాత్రికి ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా చేస్తామని, ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

పాత ఐడీ కార్డుపై రాయితీ బస్సు పాసు

జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తయినటువంటి విద్యార్థులకు సెకండియర్ తరగతులు ప్రారంభమైన దృష్ట్యా పాత ఐడీ కార్డుపై రాయితీ బస్సు పాసును అందిస్తున్నామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని కేవలం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తయిన విద్యార్థులకేనని తెలిపారు.

14 ఏళ్లు @ వంద పడకల ఆసుపత్రి

సాగుతున్న చింతలపూడి హాస్పిటల్ పనులు

నిధులు లేక ముందుకు రాని కాంట్రాక్టర్లు

ఏరియా ఆసుపత్రిలోనూ సౌకర్యాలు అరకొరే

మెరుగైన వైద్యసేవలందక రోగుల అవస్థలు

నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ప్రజల వేడుకోలు

నిర్మాణ దశలోనే ఉన్న చింతలపూడి వంద పడకల ఆసుపత్రి

ప్రజాశక్తి – చింతలపూడి

చింతలపూడి ప్రజల చిరకాల వాంఛ వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం నత్తనడకన సాగుతుంది. దీంతో పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి భవన నిర్మాణం త్వరగా పూర్తవుతుందని, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతాయని ఎదురుచూస్తున్న మండల ప్రజలకు నిరాశే మిగులుతుంది. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి 14 ఏళ్లు పూర్తయినా పనులు పూర్తి కాలేదని, మరోవైపు ఇప్పుడున్న 30 పడకల ఆసుపత్రిలోనూ సరైన వసతులు లేవని ప్రజలు వాపోతున్నారు. ప్రసూతి వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ల కొరతతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అరకొర వైద్యమే అందుతుంది. వంద పడకల ఆసుపత్రిని త్వరితగతిన పూర్తిచేసి నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

2011లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చింతలపూడికి వంద పడకల ఆసుపత్రి మంజూరు చేశారు. అప్పటి ఎంఎల్ఎ మద్దాల రాజేష్ శంకుస్థాపన చేశారు. తర్వాత అప్పటి ఎంపీ కావూరి సాంబశివరావు, తర్వాత మరో ఇద్దరు ఎంఎల్ఎలు, మళ్లీ శంకుస్థాపన చేశారు. రూ.25 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించేందుకు 2020 నవంబర్ 19న అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని చెప్పిన ఆయన తర్వాత పట్టించుకోకపోవడంతో నిధుల మంజూరు ఆలస్యం అవ్వడంతో నేటికీ నిర్మాణ దశలోనే ఉంది.

చింతలపూడి వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.23 కోట్లు మంజూరయ్యాయని, రూ.16 కోట్లతో పనులు మొదలు పెట్టారని, రూ.12 కోట్లు ఖర్చు పెట్టగా గత ప్రభుత్వంలో రూ.నాలుగు కోట్లు మాత్రమే మంజూరు చేశారని, ఇంకా ఎనిమిది కోట్లు బకాయిలు ఉండడంతో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని, అందుకే పనులు ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. నిధులు కేటాయించమని ప్రపోజల్ పెట్టించామని, నిధులు మంజూరైతే త్వరగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందిస్తామని అధికారులు చెబుతున్నారు. 2011లో ఆసుపత్రికి శంకుస్థాపన చేసేటప్పుడు సుమారు రూ.ఐదు కోట్ల బడ్జెట అని, ఆలస్యం అయ్యే కొద్దీ నిర్మాణానికి బడ్జెట్ పెరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

2011లో ఆవిష్కరించిన శిలాఫలకం

30 పడకల ఆసుపత్రిలో ఉన్న డాక్టర్లకు డిప్యూటేషన్

రోజురోజుకు చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో ఓపి సంఖ్య పెరుగుతుంది. ఆసుపత్రిలో ప్రస్తుతం ఏడుగురు వైద్యులు వైద్య సేవలందిస్తుండగా వార్డుల్లో కచ్చితంగా ఒక వైద్యులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారానికి మూడు, నాలుగు రోజులు చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేసే ఇద్దరు వైద్యులను వేరే ఆసుపత్రికి డిప్యూటేషన్ వేయడంతో ఇక్కడకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందడంలేదు. వైద్యులపై ఒత్తిడి పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్ ఇద్దరు, గైనకాలజిస్ట్ ఇద్దరు, చిన్న పిల్లల వైద్య నిపుణులు ఇద్దరు, జనరల్ మెడిసిన్ ఇద్దరు, జనరల్ సర్జన్ ఇద్దరు, రేడియాలజీ ఒకరు, అస్తమాలజీ ఒకరు అందుబాటులో ఉండాలి. ఇప్పటికే వైద్యుల కొరత ఉండగా మళ్లీ ఇక్కడ పనిచేస్తున్న వైద్యులను డిప్యూటేషన్‌పై వేరే ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకుని,రోగులకు ఇబ్బంది లేకుండా డాక్టర్లను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎంఎల్ఎ రోషన్‌కుమార్

చింతలపూడి వంద పడకల ఆసుపత్రిని త్వరగా పూర్తి చేయాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కలెక్టర్‌ను కోరారు. ఈ ఆసుపత్రికి ప్రాముఖ్యతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రి త్వరగా పూర్తి చేసేందుకు సహకారం అందించాలని కోరారు.

ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు

రామిశెట్టి సత్యనారాయణ, సిపిఎం నేత

ఈ ఆసుపత్రి చింతలపూడి ప్రజల కల. ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తుంటే ప్రభుత్వం మాత్రం ఆసుపత్రిని పూర్తి చేయలేక పోతోంది. నత్తనడకన పనులు సాగుతున్నాయి. దీంతో వైద్యం చేయించుకునేందుకు అనేక మంది ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ఆసుపత్రిని వీలైనంత వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నాం.

ఆసుపత్రిని త్వరగా పూర్తి చేయాలి

తొర్లపాటి బాబు, సిపిఐ మండల కార్యదర్శి

చింతలపూడి ఆసుపత్రికి నిత్యం కృష్ణా జిల్లా నుంచి, తెలంగాణ నుంచి వందలాది మంది ప్రజలు వస్తూ ఉంటారు. ఈ ఆసుపత్రి త్వరతగతిన పూర్తి చేస్తే అనేక మంది ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉంటారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేవు. కూటమి ప్రభుత్వంలో పూర్తి చేయాలని కోరుతున్నాం.

శ్రీరామనవమి 'అడవికొలను'కు ప్రత్యేకం..!

గ్రామదేవత జాతరతో మొదలై రథయాత్రతో ముగింపు

వారంరోజులపాటు అట్టహాసంగా శ్రీరామనవమి ఉత్సవాలు

నేటికీ బుర్రకథ, డ్రామా వంటి కళారూపాలకు ప్రత్యేక పీట

తిరుణాళ్లలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

ప్రతియేటా దేశ మంతా జరుపుకునే శ్రీరామనవమి పండుగ.. నిడమర్రు మండలం అడవికొలను గ్రామంలో మాత్రం వందల ఏళ్ల క్రితం నుంచి ప్రత్యేక ఉత్సవంగా సాగుతోంది. ఆ గ్రామస్తులు జరుపుకునే అతిపెద్ద పండుగ శ్రీరామనవమి. దేశమంతా శ్రీరామనవమిని ఒక్క రోజు పండుగగా ఉంటే.. ఆ గ్రామస్తులకు దాదాపు వారం రోజులు ఉత్సవాలుగా సాగుతాయి. ఉగాది పండుగ వెళ్లిన తర్వాత గ్రామదేవత సంగాలమ్మ జాతరతో మొదలై శ్రీరామనవి తర్వాత రోజు రథయాత్రతో ఈ పండుగ వేడుకలు ముగుస్తాయి. సంగాలమ్మ జాతరకు బుట్టబొమ్మలు, గరగలు వంటి సంప్రదాయ కళారూపాలు అనేకం ఏర్పాటు చేస్తారు. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో మొదలై మర్నాడు ఉదయం వరకూ జాతర సాగుతోంది. తర్వాత నుంచి శ్రీరామనవమి వరకూ ప్రతిరోజూ రాత్రి వివిధ కార్యక్రమాలు గ్రామంలో సాగుతాయి. బుర్రకథ, చింతామణి, హరిశ్చంద్ర డ్రామాలు, డ్యాన్స్, కామెడీ ప్రోగ్రామ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీరామనవమి రోజు గ్రామం నడిబొడ్డున ఉన్న రామాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయి.

రథోత్సవం (ఫైల్‌ఫొటో)

ప్రత్యేక ఆకర్షణగా రథయాత్ర

ఆ గ్రామంలో శ్రీరామనవమికి ప్రత్యేక ఆకర్షణగా రథయాత్ర ఉంటుంది. ఉపాధి నిమిత్తం గ్రామం నుంచి ఎక్కడికి వెళ్లినా శ్రీరామనవమి రథయాత్రలో పాల్గొనేందుకు తరలివస్తారు. గ్రామ ఆడపడుచులను, అల్లుళ్లను ప్రత్యేకంగా ఈ పండుగకు ఆహ్వానిస్తారు. శ్రీరామ నవమి మరుసటి రోజు చేపట్టే రథయాత్రకు పురాతన చరిత్ర ఉంది. ఊరి నడిబొడ్డు నుంచి ఊరి పొలిమేర వరకూ దాదాపు రెండు కిలోమీటర్లు మేర ఈ రథయాత్ర సాగుతోంది. రథంపైకి కాగడా, కుచ్చులు, గంట వంటివి పట్టుకుని ఎక్కాలంటే ప్రత్యేంగా పాటలు నిర్వహిస్తారు. ఈ పాటలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని రూ.వేలు వెచ్చించి దక్కించుకుంటారు. వీటిని దక్కించుకున్నవారంతా రథంపైకి ఎక్కి ఊరేగింపులో పాల్గొంటారు. రథంపై ఉన్నవారిని అరటిపండ్లతో కొడుతూ ఊరేగింపు సాగుతోంది. పొలిమేర వరకూ వెళ్లిన తర్వాత వెనక్కి తిప్పి గ్రామ సెంటర్‌లోకి రథాన్ని తీసుకొచ్చి నిలబెడతారు. ఏడాదికి ఒకసారి స్నేహితులు, బంధువులంతా కలిసి ఎంతో ఆనందంగా గడుపుతారు.

మహిళాలకు ఆది నుంచి పెద్దపీట

రథయాత్ర రోజు ఆ గ్రామంలో తిరణాళ్లు చాలా గొప్పగా సాగుతాయి. గ్రామస్తులు, పండుగకు వచ్చిన బంధువులంతా తిరణాళ్లకు వచ్చి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసుకుంటారు. సాయంత్రం ఏడుగంటల తర్వాత మహిళలకు ఇబ్బంది లేకుండా మగవారిని తిరునాళ్లలోకి వెళ్లకుండా గ్రామస్తులే ఆంక్షలు పెడతారు. మహిళలకు ఆది నుంచి పెద్దపీట వేస్తూ వచ్చిన ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.


అడ్మిషన్ల కోసం కృషి చేస్తున్న యుటిఎఫ్ ఉపాధ్యాయులు

ప్రభుత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

యుటిఎఫ్ ఉపాధ్యాయుల కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు యుటిఎఫ్ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలనే లక్ష్యంతో 2025 -26 జూన్ నూతన అడ్మిషన్లను ఆదివారం నుంచి చింతలపూడి నగర పంచాయతీలో ఉన్న మేడబలి ప్రధానోపాధ్యాయులు రాజు ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించి అడ్మిషన్ చేయిస్తున్నారు. 2025 జూన్ నెలలో రిటైర్మెంట్ అవుతున్న ప్రభుత్వ పాఠశాల మీద మక్కువతో అడ్మిషన్ చేయిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఊరు బడే ఎప్పటికీ శాశ్వతమని, తల్లిదండ్రులకు వివరించి అడ్మిషన్ చేస్తున్న తీరు అందరికీ ఆదర్శప్రాయమని పలువురు అభినందిస్తున్నారు.


అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత

పూళ్లలో పర్యటించిన ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా రూ.4.10 కోట్ల ఉపాధి హామీ నిధులతో పూళ్లలో నిర్మించిన సీసీ రోడ్లు, ఎంపిఎంఎస్ఆర్ ద్వారా నిర్మించిన తారు రోడ్లతో పాటు, భీమడోలు మండలం సాయిపాలెం నుంచి నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామాలను అనుసంధానం చేస్తూ నిర్మించిన తారు రోడ్డు పనులను ప్రారంభోత్సవం చేశారు. వాటి నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వట్టి పవన కుమార్, పుప్పాల హరీష్, పూళ్ల గ్రామపంచాయతీ సర్పంచి, ఉపసర్పంచి, నొర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల 33/11 కెవి సామర్థ్యం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల ఏడో తేదీన మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు ఆపరేషన్ డివిజన్ ఏలూరు ఇఇ అంబేద్కర్ తెలిపారు. దీనిలో భాగంగా విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు అవసరమైన చోట నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల కింద సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలు తొలగింపు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీని కారణంగా 11 కెవి పూళ్ల, ఎంఎం.పురం కురెళ్లగూడెం, దుద్దేపూడి, పారిశ్రామిక ఫీడర్లకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేరాలు - ఘోరాలు

చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

ట్రిపుల్ ఐటీలో చోరీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో శనివారం అర్ధరాత్రి రెండు చోట్ల చోరీ జరిగింది. ట్రిపుల్ ఐటి సిబ్బంది క్వార్టర్స్ ఎన్-1 బ్లాక్ లో ఫ్లాట్ నెంబర్లు 103 ,303లలో యజమానులు లేకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి బెడ్ రూమ్‌లోని బీరువాను తెరిచి రూ.ఆరు వేల నగదు అపహరించుకుపోయినట్లు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. ట్రిపుల్ ఐటీకి పూర్తి సెక్యూరిటీ ఉన్నప్పటికీ వరుస చోరీలు జరగడంతో ట్రిపుల్ ఐటి సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. క్లూస్ టీం వివరాలను సేకరిస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఐదుగురు అరెస్టు : బైకులు, నగదు స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ద్విచక్రవాహనాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ప్రగడవరంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ కుటుంబరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఆరు ద్విచక్రవాహనాలు, రూ.2,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె, దూడ మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మృతిచెందిన గేదె

విద్యుదాఘాతంతో పాడి గేదె, దూడ రెండు మృతి చెందిన సంఘటన మండలంలోని తెడ్లం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం... తెడ్లం గ్రామంలో చెవల సోమయ్య తోటలో విద్యుత్ మెయిన్ వైరు తెగి పిన్నిబోయిన దుర్గయ్యకు చెందిన పాడిగేదె, దూడ మీద పడడంతో అవి రెండు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న టిడిపి స్థానిక నాయకులు బండి శ్రీనివాసరావు, కేతిరెడ్డి వీరారెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని రైతును పరామర్శించారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గొల్లపల్లి జెడ్‌పి హైస్కూల్ క్రీడాకారుల ప్రతిభ

క్రీడల్లో పలు పతకాలు

పలువురి అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనపరిచి తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. క్రీడాకారులైన విద్యార్థులు పతకాల పంటను పండిస్తున్నారు. గతేడాది బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుని పి.రాధికారాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రవీంద్ర పర్యవేక్షణలో పలు క్రీడా అంశాల్లో రాణిస్తూ గొల్లపల్లి పేరును రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, టెన్నిస్ బాల్, క్రికెట్, అట్యా పాట్యా, స్క్వేయ్ మార్షల్ ఆర్ట్స్, కర్ర సాము, ఫెన్సింగ్, జూడోలో క్రీడాకారులను తీర్చిదిద్దారు. పాఠశాలలో చేరిన ఎనిమిదేళ్లల్లో ఎంతో మంది క్రీడాకారులను మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీర్చిదిద్దారు.

క్రీడల్లో ప్రతిభచూపుతున్న చిన్నారులు

గతేడాది ఏడో తరగతి చదివిన బచ్చు శ్రావణి విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన జూడో గేమ్ జిల్లా స్థాయి సెలక్షన్‌లో సెలెక్ట్ అయి అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ జూడోలో బంగారు పతకం సాధించింది. గతేడాది ఫెన్సింగ్ అసోసియేషన్ గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో జయశ్రీ అనూష సెలెక్ట్ అయి విజయనగరం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించింది. గతేడాది ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా స్థాయి గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్‌లో సెలక్ట్ అయిన షేక్ గాల్షీద్ విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్‌లో కాంస్య పతకం సాధించాడు. ఈ ఏడాది ఏలూరులో జరిగిన సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ వంద మీటర్ల పరుగుపందంలో గోపు విజయ్‌కుమార్ రజత పతకం సాధించాడు. గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఎనిమిదేళ్లు ఎంతో విజయవంతంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్ఎంసి సభ్యులు తెలిపారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు సహాయ సహకారాలు అందించారన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

ఘనంగా విరాజ్ అక్షర స్కూల్ వార్షికోత్సవం

సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మాట్లాడుతున్న ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని, ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా విరాజ్ అక్షర స్కూల్ ముందుకు సాగుతుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని చలసాని గార్డెన్స్‌లో విరాజ్ అక్షర స్కూల్స్ ఆరో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ బడేటి చంటి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని విజయవంతంగా ఆరో వార్షికోత్సవం పూర్తి చేసుకున్న అక్షర స్కూల్స్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానానికి రావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో విరాజ్ అక్షర స్కూల్ అభివృద్ధి చెంది ప్రథమ స్థానానికి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్షర స్కూల్ ఛైర్మన్ సురేంద్రకుమార్, కరస్పాండెంట్ అర్చన చౌదరి, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలుగా నమోదైన వారికి కొత్త వారికి పార్టీ సభ్యత్వ ఐడి కార్డులు ఆదివారం అందించారు. స్థానిక వైష్ణవి కళ్యాణ మండపం వద్ద ఇమ్మడి రత్నాజీ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్యకర్తలకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మట్టపర్తి రూపేష్‌కుమార్, కూరాకుల బుజ్జి, పెద్దింటి నాగు, కార్యకర్తలు అందుగులు రాములు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

విద్యుత్‌శాఖాధికారులకు ఎంఎల్ఎ రోషన్‌కుమార్ ఆదేశాలు

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

లో ఓల్టేజీ సమస్య లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. గత కొన్నేళ్లుగా లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని చింతలపూడి పట్టణం వెలమపేట వాసులు ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడి తక్షణమే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. కొన్నిరోజుల్లో పనులు పూర్తి చేసి కాలనీలో ఎటువంటి లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. సమస్య చెప్పగానే వెంటనే స్పందించిన ఎంఎల్ఎకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నూజివీడు సబ్ డివిజన్‌లో

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకునేందుకు ఈ నెల ఏడో తేదీ సోమవారం నూజివీడు సబ్ డివిజన్‌లో ప్రత్యేకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు నేరుగా ఎస్‌పికి అందించవచ్చు. ప్రజా సేవలో భాగంగా ప్రజలకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు, పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఈ సమావేశానికి హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఫిర్యాదులను తెలియజేయాలని చెప్పారు.

గురుకుల పాఠశాలకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక పెద తాడేపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. ఒకే స్కూల్ నుండి 450 మంది విద్యార్థులు 18 యూనిట్లుగా ఏర్పడి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడంతో ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ రాష్ట్ర పరిశీలకులు సిరిమువ్వ శ్రీనివాస్ వెల్లడించారని తెలిపారు. దీనిపై డిఇఒ ఇవిఎస్.నారాయణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ పశ్చిమగోదావరి సెక్రటరీ ఉంగరాల శ్రీనివాస్ స్పందిస్తూ ప్రిన్సిపల్ రాజారావును, శిక్షణ ఇచ్చిన సీనియర్ స్కౌట్స్ ఆఫీసర్ బ్రహ్మేశ్వరరావును అభినందించారు. అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో డిఇఒ నారాయణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ ఉంగరాల శ్రీనివాస్ చేతుల మీదుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు ఎంవి.బాలాజీ, ఎస్.ఆనంద్, ఎం.నవీన్, డి.కృష్ణ, బలరాం, రాజేంద్ర, సత్తిబాబు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డులు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తేన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

శ్రీరామనవమి వేడుకలను ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. యాత్రికులతో రామాలయాల వద్ద సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు యాత్రికులకు పానకం, ప్రసాదాలు అందించారు. పలుచోట్ల కార్యక్రమాల్లో ఎంఎల్‌ఎలు పాల్గొన్నారు. పలుచోట్ల భారీఎత్తున అన్న సమారాధనలు నిర్వహించారు.

దెందులూరు : పానకం తయారు చేస్తున్న ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - చింతలపూడి

రాముడు ధర్మస్వరూపులని, తండ్రి మాట కోసం శ్రీరాముడు, రాముడి కోసం సీతమ్మతల్లి సర్వభోగాలు వదిలి అడవులకు వెళ్లారని, జీవితమంటే గొప్పగా బతకటంకాదని, ధర్మంగా బతకడమని, ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మాన్ని వదలకుండా ఆచరించి చూపిన ఆదిపురుషులని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీలోని పలు వార్డుల్లో, యర్రగుంటపల్లి రాముని గట్టు వద్ద జరిగిన సీతారాముల కళ్యాణంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించే ఉత్తమ సంప్రదాయాలను రామాయణం బోధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో...

దెందులూరు : దెందులూరు నియోజకవర్గంలో శ్రీరామనవమి వేడుకలు గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద జరుగుతున్న శ్రీరామనవమి వేడుకల్లో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొని పానకం తయారీ కోసం బెల్లం స్వయంగా మధనం చేసి పానకం తయారీ చేశారు. అనంతరం దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్న శ్రీరామనవమి వేడుకల్లో స్థానిక కూటమి నాయకులతో కలిసి పాల్గొని ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

ఉంగుటూరు : శ్రీరామనవమి సందర్భంగా ఉంగుటూరు మండలం కైకరం సుందర సీతారామ స్వామి కళింగ రామాలయంలో మహిళలు సాంప్రదాయ రీతిలో పసుపు దంచారు. శ్రీరామనావమి సందర్భంగా రాములోరి కళ్యాణం తలంబ్రాల బియ్యంలో కలిపే పసుపును గ్రామస్తులు స్వయంగా రోకళ్లతో దంచారు. ఆ పసుపును బియ్యంలో కలిపి స్వామి వారి కళ్యాణంలో తలంబ్రాలుగా వినియోగించడం ఇక్కడ ప్రత్యేకత అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పసుపు దంచేందుకు మహిళలు పోటీ పడ్డారు. స్వామి కళింగ రామాలయంలో విద్యార్థులకు శ్రీరామ నామ లేఖనం పోటీలు నిర్వహించారు. చిన్మయ మిషన్ నుంచి విద్యా శాస్త్రవేత్త స్వామి పూర్వజానంద సరస్వతి వారి సమక్షంలో విద్యార్థులకు శ్రీరామనామ లేఖన పోటీలు నిర్వహించామని, విజేతలకు శ్రీరామనవమి సందర్భంగా ఆధ్యాత్మిక బహుమతులు అందించనున్నామని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కూన అప్పారావు తెలిపారు.

ఏలూరు స్పోర్ట్స్ : జిల్లా పోలీసులు ఏలూరు నగరంలోని అమీనాపేట రామాలయాన్ని గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆయన సతీమణి జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సంయుక్తంగా శ్రీరాముని కళ్యాణాన్ని నిర్వహించారు. భార్యాభర్తలిద్దరూ జిల్లా అధికారులు కావడంతో వారి చేతులమీదుగా జరిగే కళ్యాణాన్ని తిలకించేందుకు ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ కుటుంబ సమేతంగా వచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, జెసి ధాత్రిరెడ్డి పాల్గొని యాత్రికులకు అన్న దానం చేశారు. వీరితో పాటు అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు రాముని కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, ఒకటో పట్టణ, రెండో పట్టణ, మూడో పట్టణ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముసునూరు : శ్రీరామనవమి పురస్కరించుకుని మండలంలోని 16 గ్రామాల్లో రామాలయాల్లో సీత సమేత రామ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆలయాల వద్ద సీతారామ దర్శనార్థం యాత్రికులు క్యూ లైన్‌లో నిల్చున్నారు. కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పలు ప్రధాన దేవాలయాల వద్ద భారీగా అన్నదానం నిర్వహించారు. ఆయా ఆలయాల గ్రామ, ఆలయ కమిటీ పర్యవేక్షణలో నవమి కళ్యాణ ఉత్సవాలు నిర్వహించారు.

ఏలూరు సిటీ : ప్రజారక్షక పాలనకు నాందివేసిన రామరాజ్య స్థాపనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వాడవాడలా శ్రీ రామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇదే క్రమంలో ఏలూరు ఆర్ఆర్.పేటలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పెద్దఎత్తున యాత్రికులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఆయన సతీమణి బడేటి మీనా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ శ్రీసీతారాముల కళ్యాణాన్ని వాడవాడలా వైభవోపేతంగా నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. శ్రీరాముడు చూపిన మార్గంలోనే కూటమి ప్రభుత్వాధినేతలు రాష్ట్రంలో సుస్థిరపాలనకు బాటలు వేస్తున్నారని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎంఎల్ఎ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బెల్లపుకొండ శ్రీలక్ష్మి, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్, త్రిపర్ణ రాజేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఇరిగినేని చెంచయ్య, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


టి.నరసాపురంలో...

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా రామాలయాల ఆవరణంలో చలువ పందిళ్లు వేశారు. పానకం, వడపప్పు ప్రసాదంగా తయారు చేసి యాత్రికులకు పంపిణీ చేశారు. మైలవరం రోడ్డులోని ముసలి రామ మందిరంగా ఖ్యాతి పొందిన రామాలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గడిచిన 85 ఏళ్లుగా పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన పరిమిశెట్టి సత్యనారాయణ కుటుంబీకులు తలంబ్రాలు, వెండి జంధ్యం, అమ్మవారికి బంగారు తాళి, మెట్టెలు, పిల్లేళ్లు, చీర, సారే, కావిళ్లతో పానకం పుట్టింటి సారేగా సీతారాముల కళ్యాణానికి ఇవ్వడం ఆనవాయితీ. మేళతాళాలు, భాజా భజంత్రీలతో సంప్రదాయబద్ధంగా స్వామివారి కళ్యాణానికి పుట్టింటి సారే అందించారు. ఆలయం వద్ద సీతారాముల కళ్యాణం కన్నుల పండుగ నిర్వహించి అనంతరం సుమారు ఐదు వేల మందికి పైగా యాత్రికులకు అన్నసంతర్పణ నిర్వహించారు. సూరి సీతారామ మందిరం వద్ద కళ్యాణం అనంతరం పానకం, వడపప్పు ప్రసాదాన్ని అందించారు. తిరువూరు బస్టాండు వద్ద ఉన్న శ్రీ రామాలయం వద్ద కళ్యాణం అనంతరం రెండు వేల మంది యాత్రికులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌పి కాలనీలో సంప్రదాయంగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకల సందర్భంగా 1500 మంది యాత్రికులు అన్నసంతర్పణ నిర్వహించారు. ఎల్ఐసి సమీపంలోని అపార్ట్‌మెంట్ల వద్ద శ్రీరామనవమి వేడుకల సందర్భంగా సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించి అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. పట్టణంలోని రామాయమ్మారావుపేటలోని రామ మందిరం వద్ద శ్రీరామనవమి వేడుకలు నిర్వహించి భారీగా యాత్రికులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

టి.నరసాపురం : స్థానిక చిన్న రామాలయం వద్ద శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం సీతారామ కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు, తలంబ్రాలు టిడిపి నాయకులు మండం ఆదిత్యకుమార్ సమర్పించారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు అడపా నాగరాజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాగరాజుకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వేడుకల్లో స్థానికులందరూ పాల్గొనడం వల్ల వారి మధ్య ఐకమత్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండం ఆదిత్య కుమార్, బీరం రవి, నల్లూరి శ్రీనివాస్, మాధంశెట్టి రామకృష్ణ, బూబత్తుల రామారావు, శ్యామకూరి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా ఆదివారం శ్రీ రామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పండువారిగూడెం గ్రామంలో సర్పంచి సున్నం ఉషారాణి సురేష్ దంపతులు శ్రీ రామనవమి వేడుకల్లో పాల్గొని కళ్యాణం నిర్వహించారు. వంకవారిగూడెం రామాలయంలో సర్పంచి కుంజా పార్వతి, రాముడు దంపతుల అధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. దర్భగూడెం కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను ఉప సర్పంచి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించారు. పాత చీమలవారి గూడెం గ్రామంలో వేదుల జనార్ధన్ ఆధ్వర్యంలో గిరిజనులచే శ్రీ రామనవమి వేడుకలను నిర్వహించారు.


నూజివీడులో...

చాట్రాయి : మండలంలోని జనార్ధనవరం, ఆరుగొలనుపేట, సోమవరం, చనుబండ, చాట్రాయి, బూరుగుగూడెం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి సీతారాములకళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. చనుబండ గ్రామంలో పురాతన రామాలయం లో భద్రాచలం నుంచి వచ్చిన తలంబ్రాలతో సీతారా ముల కళ్యాణం ఆలయ ధర్మకర్తలు, పూజారులు కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ప్రతి సంవత్సరం భద్రాచలం నుంచి తలంబ్రాలు రావడం ఆనవాయితీ. యాత్రికులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

CHANGE IN NAME
I, **DURGA DEVI BOKKA** Resi. 8-126, Subbaraydu Gudi Veedhi, Mandapaka, Tanuku mandalam, District West Godavari e Andhra Pradesh 534218. Previously I was Known and called as **DURGA DEVI SRINIVAS BOKHA** now I will be known As **DURGA DEVI BOKKA**